క్లుప్తంగా

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కొడాలి వేంకటేశ్వరరావు(నాని) దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వ్యక్తిగత కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని ఆయన కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



గుడివాడ టౌన్: దీపావళి సందర్భంగా భారీగా బాణసంచా పేల్చి పర్యావరణాన్ని కాలుష్యం చేయవద్దని ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చడం వల్ల డబ్బు వృథాతో పాటు వాతావరణం కలుషితం అవుతుందని.. ప్రజలు ఈ విషయం గ్రహించాలని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ జి.జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపులు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని భక్తులు అత్యధికంగా ఆదివారం దర్శించుకున్నారు. జోరువానలో సైతం భక్తులు ఆలయానికి విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళలు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించి తల్లి ముందు ప్రణమిల్లారు.

దీపావళి ప్రజల్లో సంతోషం నింపాలి



చిలకలపూడి(మచిలీపట్నం): ఈ దీపావళి ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగించి సంతోషపు వెలుగులు నింపాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొంది ఆర్థికంగా అభివృద్ధి చెంది ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలను తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజినీ వైద్య పరీక్షలు చేశారు. దాతలు నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 120 మందికి పరీక్షలు చేశామని లయన్స్ చైర్మన్ పెరుమాళ్ల తెలిపారు. అనంతరం 15 రోజులకు సరిపడా ఉచిత మందులను పంపిణీ చేశారు. లయన్స్ ప్రతినిధులు వైపీసీ ప్రసాద్, మూల్పూరి సుధ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు టపాసుల విక్రయాలు!

పామర్రు: దీపావళి పండుగను పురిష్కరించుకుని అనుమతులు ఇచ్చిన టపాసుల దుకాణాలలో దుకాణదారులు అధిక రేట్లకు టపాసులను అమ్మకాలు జరుపుతున్నట్లు కొనుగోలు దారులు వాపోతున్నారు. దీంతో తమ జేబులకు చిల్లులు పెడుతున్నారని కొనుగోలుదారులు ఆదివారం తెలిపారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది దీపావళి టపాసుల అమ్మకాలను అధిక ధరలకు విక్రయిస్తుండడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కొన్ని టపాసులను లేబుల్ లేకుండానే అధిక ధరలకు అమ్మకాలు జరుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కాగా మండల కేంద్రమైన పామర్రులో 5 టపాసుల దుకాణాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జి.రవికాంత్ పేర్కొన్నారు. పామర్రు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి దుకాణాల ప్రదేశాన్ని పరిశీలన చేసి అనుమతులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పండుగను పలు జాగ్రత్తలు పాటించి నిర్వహించుకోవాలని అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడినా వెంటనే 08674 253120 నంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.



మొవ్వలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణం

దుకాణాలకు వర్షం దెబ్బ..

మొవ్వ: ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఏర్పడిన అల్పపీడనంతో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం దీపావళి బాణసంచా దుకాణాలకు గ్రహణంగా మారింది. మొవ్వ మండలానికి అనుమతులు లభించిన 9 దుకాణాలలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. బాణసంచా విక్రయాలకు రెండు రోజులైన ఆది, సోమవారాలలో మాత్రమే అనుమతులు లభించడంతో లైసెన్సుదారుల పరిస్థితి అయోమయంగా మారింది. కొన్ని



మట్టి ప్రమిదలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

దుకాణాలలో ఎమ్మార్పీ రేటుపై 80 శాతం డిస్కౌంట్ ఇస్తామంటూ ప్రచారాలు విస్తృతంగా జరుగుతున్నా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో కొనుగోలుదారులు సైతం ఆసక్తి చూపడంలేదు.

విక్రయదారులు నిబంధనలు పాటించాలి..

కైకలూరు: దీపావళి టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలని కైకలూరు పట్టణ సీఐ ఏవీఎస్



కైకలూరు ఏఎంసీ ప్రాంగణంలో దుకాణాల వద్ద సూచనలు చేస్తున్న సీఐ రామకృష్ణ

రామకృష్ణ సూచించారు. కై కలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన దుకాణాలను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ఏమైనా అగ్నిప్రమాదం జరిగితే నివారించడానికి నీరు, ఇసుక దగ్గరలో ఉంచుకోవాలన్నారు. దుకాణాల వద్ద చిన్న పిల్లలకు మందుగుండు సామగ్రి విక్రయించవద్దని.. టపాసులు దుకాణాల వద్ద కాల్చే ప్రయత్నాలు చేయవద్దని వివరించారు.

వర్షంతో రహదారులు జలమయం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని అంతర్గత రహదారులన్నీ జలమయంగా మారాయి. ప్రధానంగా పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. పలు కాలనీల్లో సైతం అంతర్గత రోడ్లు సరిగా లేకపోవడంతో ఇళ్ల చుట్టూ నీరు చేరింది. ప్రధాన రహదారులపై సైతం నీరు నిలవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముదినేపల్లి సెంటర్‌తో పాటు గురజ, బంటుమిల్లి వైపు వెళ్లే రహదారులపై వర్షం నీరు నిలిచిపోయింది. ముదినేపల్లి నుంచి గురజ మీదుగా గుడ్లవల్లేరు వైపు వెళ్లే రోడ్డు పూర్తి గోతులమయంగా మారడంతో వర్షపునీరు భారీగా నిలిచింది. వణుదుర్రు గ్రామంలో రహదారులపై నీరు నిలిచిపోయింది. పెయ్యేరు సింగరాయపాలెం, శ్రీహరిపురం, కాకరవాడ, అన్నవరం కాలనీల్లోనూ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చేవూరు దళితవాడ



వణుదుర్రులో నీటమునిగిన అంతర్గత రోడ్డు

కాలనీలో నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

గన్నవరం: ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ గన్నవరం తాలుకా యూనిట్ అధ్యక్షుడు వి. సాంబశివరావు కోరారు. స్థానిక ఎన్జీజీవోస్ భవనంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ డీఏ బకాయిలు, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, సరండర్ లీవ్స్ అమౌంట్ చెల్లింపు, హెల్త్ కార్డు తదితర సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు



సమావేశంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

డి. రాంబాబు, జి. శ్రీను, డి. శ్రీనివాసరావు, ప్రసాద్, ఉమామహేశ్వరరావు, సునీల్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తుల సమాచారం ఇవ్వాలి

గుల్లలమోద(నాగాయలంక): మండలంలోని తీరప్రాంత గ్రామమైన గుల్లలమోదలో పాలకాయతిప్ప కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్(సీఎస్‌పీఎస్) ఇన్‌స్పెక్టర్ ఆర్.సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగాయలంక ఎస్ఐ కలిదిండి రాజేష్, సిబ్బందితో కలసి ఆదివారం ప్రజలకు కమ్యూనిటీ అవగాహన నిర్వహించారు. గ్రామంలో అధికారులు మాట్లాడుతూ తీర గ్రామాల్లో మత్స్యకారులు నిరంతరం చైతన్యంతో ఉండాలని కోరారు. కొత్త వ్యక్తుల సంచారం గర్తించి సమాచారం మెరైన్ పోలీస్ అధికారులు, సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. చేపల వేటకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణం మెరైన్, ఎల్ అండ్ ఓ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎలాంటి కష్ట సమయంలోనైనా నిబంధనలు విధిగా



గుల్లలమోద గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

పాటిస్తూ గ్రామస్తులంతా ఐక్యతతో పరస్పర సహకారంతో ఉండాలని వివరంచారు. సంఘమిత్ర సంస్థ ప్రతినిధి జి.గోపినాథ్, మెరైన్ పోలీస్ స్టాఫ్, పెద్దలు, వేట మత్స్యకారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం

కై కలూరు: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి దాతలు ఆదివారం సహాయం అందించారు. ఈనెల 14న ఆచవరంలో బుర్ల రామస్వామి తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దుస్తులు, సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో రామస్వామి కుటుంబ సభ్యులకు కట్టుబట్టలే మిగిలాయి. ఘటనపై స్పందించిన పలువురు దాతలు నిత్యావసర సరుకులు, నగదును బాధితులకు సాయంగా అందజేశారు.



బాధితులకు సహాయం అందిస్తున్న దాతలు

రామలింగేశ్వరుడికి మాస శివరాత్రి అభిషేకాలు

నాగాయలంక: మాస శివరాత్రి, నరకచతుర్థశి పర్వదినాలు పురస్కరించుకుని స్థానిక శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ శ్రీగంగ పార్వతీ సమేత రామలింగే శ్వర స్వామి మండపంలో స్వామివారికి ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అభిషేకాలు, హారతులు సమర్పించారు. అంబా సాయికిరణ్‌శర్మ నేతృత్వంలో పండితుల బృందం వివిధ అభిషేకాలు, మాస శివరాత్రి ప్రత్యేక పూజ, అలంకారం నిర్వహించారు. స్వామివారిని పండితులు సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి భక్తులకు ఆశీస్సులు అందించారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, తలశిల రఘుశేఖర్, ఉప్పల లీలాకృష్ణప్రసాద్ (బుజ్జి), కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

గుడివాడ టౌన్: మోపిదేవి గురుకుల పాఠశాల బీసీ హాస్టల్ విద్యార్థి ఎ.భార్గవ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల కాలంలో హాస్టల్ విద్యార్థులకు పచ్చకామెర్లు, మలేరియా వంటి వ్యాధులు సోకుతున్నాయని.. ఇంత వరకూ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఏ విధమైన చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. భార్గవ్ మృతిపట్ల సమగ్ర విచారణ జరిపాలని అన్నారు. అప్పుడే మృతికి కారణం తెలుస్తుందని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

పామర్రు(తోట్లవల్లూరు): మండల పరిధి గరికపర్రు గ్రామంలో బీవీఆర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో సామాజిక సేవా ప్రధాత బొమ్మారెడ్డి వెంకటరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పమిడిముక్కల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొని శిబిరాన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం మరొకరికి ప్రాణదానం అన్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తాన్ని దానం ఇవ్వవచ్చని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో బీవీఆర్ యూత్ సభ్యులు, అభిమానులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో విశ్వశాంతి విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యశేఖర్, పొట్లూరి గోపాలకృష్ణమూర్తి, బీవీఆర్ యూత్ అధ్యక్షులు శ్యామ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

భక్తిశ్రద్ధలతో త్రయోదశి పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు శివాలయాల్లో త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానిక ఐటీఐ రోడ్డులోని భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి దేవస్థానం, వీరవల్లిలోని గంగా పార్వతి సమేత కొండేశ్వరస్వామి దేవస్థానం, పెరికీడులోని ముక్తికాంత సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థానం, కానుమోలులోని సోమేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం ప్రదోషకాల సమయంలో నందీశ్వరస్వామికి పంచామృతాభిషేకం వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీశైలమల్లికార్జునస్వామి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పామర్రు(తోట్లవల్లూరు): బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కు ఎంతగానో ఉపయుక్తం అవుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలంలోని పలు గ్రామాల బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల పరిధి గరికపర్రు గ్రామంలోని యరగాని గుణప్రియకు రూ.20,464లు, యాకమూరు గ్రామంలోని మొట్టికాయల రాధాకృష్ణకు రూ.41,870ల చెక్కులను అందజేశామని తెలిపారు. అనంతరం కుమ్మమూరు గ్రామంలో శస్త్ర చికిత్స చేయించుకున్న సూరపనేని శివరాంను పరామర్శించారు. తదుపరి తోట్లవల్లూరు గ్రామంలో నెక్కలపూడి బేబీ అకాల మరణం చెందగా ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్

నాంచారమ్మసేవలో సినీ నిర్మాత ఘట్టమనేని

కోడూరు: కృష్ణాతీరంలోని విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని సినీనటుడు కృష్ణ సోదరుడు సినీనిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం ఆదిశేషగిరిరావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. నాంచారమ్మకు పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మనవరాళ్లకు ఉయ్యాల వేడుకను ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అధికారిణి జయశ్రీ ఆదిశేషగిరిరావు దంపతులకు అందించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా) కూడా వీరితో పాటు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



మనవరాళ్లకు ఉయ్యాల వేడుక నిర్వహిస్తున్న ఆదిశేషగిరిరావు

ఇద్దరు చిన్నారులపై తల్లి దాడి

పెనమలూరు: తాడిగడపలో ఇద్దరు చిన్నారులపై ఓ మహిళ, ఆమెతో ఉంటున్న వ్యక్తి దాడి చేయడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. తాడిగడపలో ఓ వివాహిత భర్తకు దూరంగా ఉంటూ ప్రస్తుతం వేరే వ్యక్తితో వివాహేతర సంబంధంలో ఉంటోంది. కాగా గతంలో ఆమె తన ఇద్దరు పిల్లలు(7), (5)ను సదరు వ్యక్తితో కలిసి చితకబాదడంతో ఇంటి పక్కన ఉన్న వారు ఆమెను తీవ్రంగా మందలించారు. తీరు మార్చుకోని వివాహిత మరలా పిల్లలను శనివారం బాగా కొట్టడంతో ఇరుగూపొరుగు వారు గ్రామంలోని మహిళా సంరక్షణ కార్యదర్శి ఎండీ ఇంతియాజ్‌బేగంకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇంతియాజ్‌బేగం జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఇద్దరిపైనా కేసు నమోదు చేసి చిన్నారులను ఆసుపత్రికి తరలించారు.

కృష్ణాజిల్లాకు వీఎం రంగా పేరు పెట్టాలి

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లాకు మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని రాధా– రంగా మిత్రమండలి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు ఈ డిమాండ్‌ను చేశారు. ఈ సందర్భంగా రాధా– రంగా మిత్రమండలి కృష్ణా జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించి కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను మిత్రమండలి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు అందజేశారు. ఈ సమావేశంలో న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, నాయకులు వడ్లమూడి చిన్న, మాదివాడ రాము, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బత్తిన రమేష్ బాబు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పుప్పాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధా-రంగా మిత్రమండలి ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు ధర్మారావు

17 మంది జూదరుల అరెస్టు

పెనమలూరు: కానూరులోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 17 మంది వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. కానూరు తులసీనగర్‌లో కృష్ణలంకకు చెందిన సుంకర శ్యామ్ అనే వ్యక్తి ఇంట్లో పేకాట నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు జూదరుల ఇంటిపై దాడి చేసి 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3.10 లక్షల సొమ్ము స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేశారు.

ఎడ్లబండ్లపై అక్రమంగా ఇసుక రవాణా

చల్లపల్లి: మండల పరిధిలోని నడకుదురు ఇసుక క్వారీ నుంచి ఎడ్లబండ్లపై అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. తెల్లవారుజామున, ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా ఈ రవాణా సాగిస్తున్నారు. నడకుదురు, నిమ్మగడ్డ ఇసుక క్వారీలు కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలో ఉన్నాయి. పర్యావరణం, వనరుల సంరక్షణ రక్షణలో భాగంగా ఈ సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న ఇసుక క్వారీల నుంచి ఇసుకను తరలించటం నిషేధించారు. నిషేదాజ్ఞలు ఉన్నప్పటికీ కొందరు లెక్కచేయకుండా ఇల ఎద్దుల బండ్లపై తీసుకుపోతున్నారు. రూ.800 నుంచి రూ.1000 వరకూ దూరాన్ని బట్టి అమ్ముకుంటున్నారు. అధికారులు స్పందించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

పెనమలూరు: గోసాల గ్రామంలో శనివారం రాత్రి గ్యార్మీ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో జెండాలు ప్రదర్శించి జెండా చెట్టు వద్ద ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి, గ్రామ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కన్వీనర్ పోలవరపు రవి, వార్డు సభ్యుడు ఎండీ ఆసీఫ్‌బాషా, స్థానికులు హాజీఆలీ, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

